సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 3 । ఆగస్టు । 2023



గ్రామాల్లోనే వైద్యం
జ్వరాలు, దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో వైద్యం అందిస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల్ని ఆశ్రయించే పరిస్థితి తప్పింది. 8లో ▸



గంజాయి అడ్డుకట్టకు చర్యలు
గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను ఆమె సందర్శించారు. 8లో ▸



నారుమడుల పరిశీలన
నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో నీటమునిగిన పంట చేలను వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్‌కుమారి గురువారం పర్యటించారు.

వరద సాయం భేష్

- 3 మండలాల్లోని 30 గ్రామాల్లో వరద ప్రభావం
- 15 చోట్ల పునరావాస కేంద్రాల ఏర్పాటు
- 6,011 కుటుంబాలకు రేషన్, నిత్యావసరాల పంపిణీ



ఆచంట మండలం భీమలాపురం పునరావాస కేంద్రంలో భోజనం పెడుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వరద పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో నిత్యావసరాల పంపిణీ యుద్ధ ప్రాతిపదికన సాగుతోంది. యలమంచిలి, ఆచంట, నర్సాపురం మండలాల్లోని వరద తీవ్రత ఎక్కువగా ఉన్న లంక గ్రామాలు, వరద ప్రాంతాల్లో బాధితులకు 15 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం అందించారు.

6,011 కుటుంబాలకు నిత్యావసరాలు

యలమంచిలి, ఆచంట, నర్సాపురం మండలాల్లోని వరద ప్రభావిత 30 గ్రామాలకు సంబంధించి 6,011 కుటుంబాలకు రేషన్ బియ్యం, నిత్యావసరాలు అందించారు. నిత్యవసర వస్తువులు పంపిణీ ప్రారంభించిన నాటి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీలు చొప్పున 1,502.75 క్వింటాళ్ల బియ్యం, ప్రతి కుటుంబానికి కేజీ చొప్పున కందిపప్పు, లీటర్ పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపల చొప్పున 6,011 కుటుంబాలకు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో వంకాయలు, పచ్చిమిర్చి పంపిణీ చేశారు. 65 మెట్రిక్ టన్నుల పశువుల దాణా సిద్ధంగా ఉంచారు.

సకాలంలో ఆదుకోవడంపై బాధితుల హర్షం

గోదావరి వరద ఉధృతి ముందుగానే గుర్తించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయించారు. భోజనం సౌకర్యంతో మంచినీరు, రేషన్, నిత్యావసరాలు అందించడంపై వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వలంటీరు నుంచి వీఆర్వో, ప్రత్యేక అధికారుల వరకూ అందరూ నిత్యం అందుబాటులో ఉండి వరద విపత్తు నుంచి రక్షించారని ముందస్తుగానే సహాయక చర్యలు చేపట్టిన కలెక్టర్‌కు వారు అభినందనలు తెలిపారు.



యలమంచిలి మండలం కనకాయ లంకలో రేషన్ అందిస్తున్న దృశ్యం





ఆచంట మండలంలోని లంక గ్రామాల్లో ముంపు బాధితుల కోసం కోడిమాంసం, కోడిగుడ్లను ఆటోలు, పడవల్లో పంపిస్తున్న దృశ్యం

కష్టంలో ఆదుకున్నారు



గోదావరికి వరదలు పోటెత్తడంతో ప్రభుత్వం మాకు ముందుగానే అవసరమైన పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు రేషన్ బియ్యం, ఉచితంగా నిత్యావసరాలు, కూరగాయలు అందించి ఆదుకున్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అధికారులు గ్రామంలో ఉండి కావాల్సిన అన్ని సహాయక చర్యలు అందించారు.
– పి.సోమాలమ్మ, దొడ్డిపట్ల

ఏర్పాట్లు బాగున్నాయి



ముందుగానే మాకు రేషన్, నిత్యావసరాలు అందించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. భోజన సౌకర్యం కల్పించారు.
– బి.సూర్యనారాయణమూర్తి, కనకాయలంక

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



జగన్నాథపురంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రాజెక్టుల సందర్శన పేరిట ముచ్చుమర్రు పర్యటనకు చంద్రబాబు వెళ్లడంతో పచ్చమీడియా ఎంతో హడావిడి చేసిందని, పర్యటనలో అసలు బండారం బయటపడిందని, చంద్రబాబు కారు వెనక పది మంది కూడా లేరని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. బుధవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమ ప్రాంత రైతులకు చంద్రబాబు న్యాయం చేసి ఉంటే తండోపతండాలుగా రావాలని, ఆ పరిస్థితి కానరాలేదన్నారు. ఆ ప్రాంతంలో చంద్రబాబుకు ఎంత క్రేజ్ ఉందో తెలుస్తుందన్నారు. చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు రాజకీయం ఏమైందని ప్రశ్నించారు. జగన్‌పై సంపూర్ణ నమ్మకంతో ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. చంద్రబాబును ప్రజలు దద్దమ్మ కింద లెక్కేసారని దుయ్యబట్టారు. రాష్ట్ర రాజకీయాల్లో టీడీపీ పాతాళానికి వెళ్ళిపోయిందన్నారు. అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని, 2024 ఎన్నికల్లో టీడీపీకి, చంద్రబాబుకి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

1,000 కేజీల కోడిమాంసం, 10 వేల కోడిగుడ్ల వితరణ

పోడూరు: వరదతో ఇబ్బంది పడుతున్న ఆచంట మండలంలోని లంకగ్రామాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు మరోసారి అండగా నిలిచి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సొంతఖర్చులతో బాధితుల కోసం బుధవారం దాదాపు 1000 కేజీల కోడిమాంసాన్ని, 10 వేల కోడిగుడ్లను లంకగ్రామాలకు చేరవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ వరద బాధితులకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. తాను కూడా బాధితులకు 24 గంటలూ అందుబాటులో ఉంటున్నానన్నారు. పునరావాస కేంద్రాల్లో భోజనం, అల్పాహారం, తాగునీరు వంటి సదుపాయాలకు లోటు లేకుండా చూస్తున్నామన్నారు. పశువులకు కూడా ఆహార కొరత లేకుండా ఇప్పటికే దాదాపు 28 టన్నుల సంపూర్ణ సమీకృత దాణాను లంక గ్రామాలకు అందించామన్నారు. వరదలతో వివిధ పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని, బాధిత రైతులకు ప్రభుత్వ పరిహారం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. లంక గ్రామాలకు చెందిన పలువురు మాట్లాడుతూ గతేడాది వరదల్లో కూడా ఎమ్మెల్యే వరద ముంపు బారిన పడ్డ లంక గ్రామాల ప్రజలకు సొంత ఖర్చులతో భోజన సదుపాయం ఏర్పాటు చేశారన్నారు. పశువులకు కూడా తాడేపల్లిగూడెం నుంచి సొంతఖర్చులతో భారీగా పశుగ్రాసాన్ని పంపిణీ చేశారన్నారు. తాజాగా మరోసారి తమకు కోడిమాసం, గుడ్లు పంపించడంతో లంకగ్రామాల ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

రూ.30 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ఉంగుటూరు: కాకర్లమూడిలో కంచర్ల సులోమికి రూ.30 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు బుధవారం అందించారు. కంచర్ల సులోమికి జన్మించిన కవలలకు అనారోగ్య సమస్యల వల్ల లక్షలాది రూపాయలు ఖర్చయ్యాయి. వాసుబాబు సీఎంతో మాట్లాడి రూ.30 లక్షల మంజూరు చేయించారు. చెక్కును స్వయంగా ఎమ్మెల్యే వెళ్ళి బాధితుల ఇంటివద్ద అందజేశారు.

94 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి



భీమవరంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పశ్చిమగోదావరి జిల్లాలో రెండు రోజుల్లో 94 శాతం పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 2,15,683 పెన్షన్‌లు ఉండగా రూ.59 కోట్లు ఖర్చు చేశారు. ఈ రెండు రోజుల్లో రెండు లక్షలకు పైగా పెన్షన్లు పంపిణీ చేశారు.

శాంతించిన గోదావరి

యలమంచిలి: గోదావరి శాంతించింది. దీంతో వారం రోజులుగా వరద ముంపునకు గురైన యలమంచిలి మండలంలోని కంచుస్తంభంపాలెం, బూరుగుపల్లి, దొడ్డిపట్ల, కనాకయలంక, పెదలంక, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, లక్ష్మీపాలెం, నారినమెరక, శిరగాలపల్లి, యలమంచిలిలంక, ఏనుగువానిలంక, బాడవ గ్రామాల ప్రజలు, ప్రభుత్వ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గత నెల 21 నుంచి వరద ముంపులో ఉన్న కనకాయలంక కాజ్‌వే సైతం బుధవారం బయటపడింది. దీంతో కనకాయలంక ప్రజలు కాజ్‌వే మీద రాకపోకలు ప్రారంభించారు.

పశువుల దాణా పంపిణీ

వరద తీయడానికి ముందే ప్రభుత్వం ప్రారంభించిన సహాయ చర్యలు బుధవారం కూడా కొనసాగాయి. వరద పూర్తిగా తీయడంతో ఒకవైపు పారిశుధ్య చర్యలు చేపట్టిన అధికారులు మరో వైపు ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ కూడా కొనసాగించారు. వరద వలన పచ్చిగడ్డి బీడులు మొత్తం బురదమయం కావడంతో పశువులకు ఆహార కొరత తీర్చడానికి పశు వైద్య అధికారులు మిశ్రమ దాణా పంపిణీ చేస్తున్నారు. వరద ముంపునకు గురయిన 13 గ్రామాలలోను వైద్య, పశు వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. వలంటీర్స్, వైద్య సిబ్బంది కలసి జ్వరం సర్వే నిర్వహిస్తున్నారు.



కనకాయలంక వద్ద వరద నీటి నుంచి బయటపడిన కాజ్‌వే



పశువుల దాణా అందజేస్తున్న దృశ్యం

● నాడు పడిగాపులు.. నేడు ఇంటికే పింఛన్





ఉదయం వెళ్తే సాయంత్రమైనా పట్టించుకునే నాథుడే లేదు అన్నట్లుగా ఉండేది నాడు పింఛన్ల పంపిణీ.. తిండీతిప్పలు మానేసి పంచాయతీ ఆఫీసు వద్దే పడిగాపులు కాసేవారు. అక్కడకు వెళ్ళి కూర్చుంటే.. వేలిముద్రలు పడడం లేదని తిప్పేవారు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కోడి కూయకముందే ఒకటో తారీఖునే పింఛన్ ఇచ్చేలా చేశారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

గర్భిణులు, బాలింతలకు రేషన్ కిట్లు



భీమవరం కలెక్టరేట్‌లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న జేసి రామ్‌సుందర్‌రెడ్డి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు

భీమవరం(ప్రకాశం చౌక్): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. బుధవారం భీమవరం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ఆయన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. గర్భిణులు,బాలింతలకు టేక్ హోం రేషన్ కిట్లను అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో పోషక విలువలు కలిగిన పది రకాల ఆహారాన్ని కిట్ల రూపంలో ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డలే భావి భారత పౌరులని, దేశానికి సంపద వారే అని అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇంటికే పౌష్టికాహారం అందించే గొప్ప కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం పనిచేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ ఎం.సుజాత రాణీ మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో అందించే కిట్ లో మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, 500 గ్రాములు నూనె, 2.5 లీటర్ల పాలు (మొదటి విడత), 13 కోడిగుడ్లు (మొదటి విడత), రెండు కేజీల రాగి పిండి, ఒక కేజీ అటుకులు, 250 గ్రాములు చొప్పున ఎండు ఖర్జూరం, వేరుశనగ చిక్కి, బెల్లం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.కృష్ణవేణి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, ఏపీ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మేడిది జాన్సన్, ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత, రాష్ట్ర బాల హక్కుల కమిషన్ సభ్యుడు జె.రాజేంద్ర ప్రసాదు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు పాల్గొన్నారు.

నూరు శాతం టీకాలు వేయాలి



మిషన్ ఇంద్రధనుష్‌పై మాట్లాడుతున్న డీఆర్వో

భీమవరం (ప్రకాశంచౌక్): మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా చిన్నారులకు, గర్భిణులకు నూరుశాతం అన్ని రకాలు టీకాలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజంగా తీర్చిదిద్దాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మిషన్ ఇంద్రధనుష్ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల వరకు, గర్భిణులకు నూరుశాతం రోగ నిరోధక శక్తి టీకాలు వేయాలన్నారు. ఫేజ్ –5 మొదటి రౌండు ఈ నెల 7 నుంచి 12 వరకు జరిగే ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. టీకాలు వేసే సమయంలో గతంలో ఎప్పుడు టీకాలు వేయించుకున్నారు, ఏ ఏ టీకాలు వేయించుకున్నారు అని పరిశీలించి మాత్రమే టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.దేవసుధ, ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్ ప్రవీణ్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మువ్వన్నెల జెండాకు ప్రపంచంలో గుర్తింపు



భీమవరం భారీ జాతీయజెండా ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో దాసి రాజు

సాక్షి, భీమవరం: జాతీయ పతాకానికి ప్రపంచంలోనే గుర్తింపు ఉందని మువ్వన్నెల జెండా స్వాతంత్ర ఉద్యమంలో ఉద్యమ స్ఫూర్తి నింపిందని భీమవరం ఆర్డీవో దాసి రాజు అన్నారు. బుధవారం జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగ రాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), చెరుకువాడ రంగసాయి, కొత్తపల్లి శివరామరాజు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పి.ప్రవీణ్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సాయిధరమ్ తేజ్



శ్రీవారి ఆలయంలో సాయిధరమ్ తేజ్‌కు స్వామి ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం రూరల్: /భీమవరం (ప్రకాశంచౌక్): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రముఖ సినీ హీరో సాయిధరమ్ తేజ్ బుధవారం ఉదయం సందర్శించారు. శ్రీవారి ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికి, ప్రసాదాలను అందజేశారు. అలాగే జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని బుధవారం సినీనటులు సాయిధరమ్‌తేజ్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. భీమవరంలోని మావుళ్లమ్మ గుడిని కూడా సాయి ధరమ్ తేజ్ సందర్శించారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక అధికారుల నియామకం

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల నమోదుకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 నియోజకవర్గాల్లో కొవ్వూరు నియోజకవర్గానికి కొవ్వూరు ఆర్డీవో, నిడదవోలు నియోజకవర్గానికి కొవ్వూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆచంట నియోజకవర్గానికి పశ్చిమగోదావరి జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్, పాలకొల్లు నియోజకవర్గానికి నరసాపురం డీఎల్‌డీవో, నరసాపురం నియోజకవర్గానికి నరసాపురం సబ్‌కలెక్టర్, భీమవరం నియోజకవర్గానికి భీమవరం ఆర్డీవో, ఉండి నియోజకవర్గానికి పశ్చిమగోదావరి జిల్లా డీపీవో, తణుకు నియోజకవర్గానికి పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి పశ్చిమగోదావరి జిల్లా ఉద్యానవన శాఖాధికారిని నియమించింది. ఉంగుటూరు నియోజకవర్గానికి ఏలూరు ఆర్డీవో, దెందులూరు నియోజకవర్గానికి కేఆర్ఆర్ డిప్యూటీ కలెక్టర్, ఏలూరు నియోజకవర్గానికి జెడ్పీ సీఈవో, గోపాలపురం నియోజకవర్గానికి ఓఎన్‌జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పోలవరం నియోజకవర్గానికి జంగారెడ్డిగూడెం ఆర్డీవో, చింతలపూడి నియోజకవర్గానికి ఏలూరు ఆర్ఎంసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు.

విజయవంతంగా టోఫెల్ ఆన్‌లైన్ పరీక్ష

ఆకివీడు: టోఫెల్ విధానంలో మండలంలోని ఎంపీయూపీ, ఎంపీపీ స్కూల్ పిల్లలకు ఆన్‌లైన్ పరీక్షల్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పరీక్షా కేంద్రాల్ని పరిశీలించిన అనంతరం మండల విద్యాశాఖ అధికారి–2 వీ.సీతారామయ్య మాట్లాడుతూ 3వ తరగతి నుండి 8వ తరగతి వరకూ సిద్ధాపురం, అజ్జమూరు ఎంపీపీ స్కూల్స్, కాళింగపేట, దుంపగడప, కుప్పనపూడి, ఈస్టుపాలెం ఎంపీయూపీ స్కూళ్లలోని విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారని చెప్పారు. నాలుగు విద్యా నైపుణ్యాలైన చదవడం, వినడం, రాయడం, మాట్లాడటం వంటివి ఆన్‌లైన్ పరీక్షల్లో విద్యార్థుల్ని ప్రశ్నిస్తారని, వారు అక్కడికక్కడే సమాధానం తెలియజేస్తే ఆన్‌లైన్‌లో నమోదవుతుందని చెప్పారు. విద్యార్థులకు గురువారం టోఫెల్ పరీక్ష టీవీలో వీక్షిస్తూ సమాధానాలు చెబుతారని తెలిపారు.

క్లుప్తంగా

మినీ వ్యాన్‌ను ఢీకొన్న ట్రాక్టర్

ముగ్గురికి స్వల్పగాయాలు



ట్రాక్టర్ ఢీకొనడంతో దెబ్బతిన్న మినీ వ్యాన్ ముందు భాగం

ఆకివీడు: ఉప్పుటేరు వంతెన సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆకివీడు నుంచి కై కలూరు వైపు ఉప్పుటేరు వంతెన ఎక్కుతున్న ట్రాక్టర్, మందపాడు రోడ్డు నుంచి వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి ఎదురుగా ఆకివీడు నుంచి భువనపల్లి వెళుతున్న మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మినీ వ్యాన్‌లో ఉన్న డ్రైవర్, మరో ఇద్దరు గాయాలపాలై చిక్కుకుపోగా, స్థానికుల సాయంతో బయటకు తీశారు.

వ్యాపారి అరెస్టు.. నిషేధిత సిగరెట్ల స్వాధీనం



మాట్లాడుతున్న విజిలెన్సు ఎస్పీ కరణం కుమార్

తాడేపల్లిగూడెం: విజిలెన్సు ఎస్పీ కరణం కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో ఓ వ్యాపారిని అరెస్టు చేసి అతని నుంచి నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సతీష్ అనే వ్యాపారి ఎటువంటి అనుమతులు లేకుండా నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు బుధవారం విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో వ్యాపారి సతీష్ ఇంట్లో సుమారు రూ.4.03 లక్షల విలువైన 8075 పెట్టెల నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎస్పీతో సీఐ విల్సన్, తూనికల కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులకు గ్రామాల్లోనే వైద్యం

- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో పరీక్షలు, వైద్య సేవలు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు



భీమవరం మండలం శ్రీరామపురం విలేజ్ క్లినిక్‌లో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం(ప్రకాశం చౌక్): వర్షాకాలం వస్తే సీజనల్ వ్యాధులు చుట్టుముడతాయి. ఈ సీజన్‌లో దగ్గు, జలుబు, జ్వరంతోపాటు మలేరియా, డెంగీ వంటి జ్వరాలు కూడా విజృంభిస్తాయి. అయితే సీజనల్ వ్యాధులను ఆదిలో నియంత్రించేలా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు పనిచేస్తున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు జ్వరం, ఇతర సాధారణ వ్యాధులు సోకితే స్థానికంగానే వైద్య సేవలు సకాలంలో అందిస్తున్నారు.

విలేజ్ క్లినిక్‌ల్లో పరీక్షలు, వైద్య సేవలు

జిల్లాలో 345 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. ఈ క్లినిక్‌ల్లో 14 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు పరీక్షలు ఉచితంగా చేసి వెంటనే వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామంలో ఎవరికైనా జ్వరాలు ఉన్నాయనే దానిపై ఆశాలు, ఏఎన్ఎంలు సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించి వారిని విలేజ్ క్లినిక్‌లకు తీసుకువచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు.

పీహెచ్‌సీలలో మెరుగైన సేవలు

రోగులకు మెరుగైన వైద్యం అవసరం అయితే స్థానిక పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇన్ పేషెంట్‌గా ఉంచి వైద్యుల పర్యవేక్షణలో వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం జ్వరాలపై పీహెచ్‌సీ వైద్యులు దృష్టిపెట్టారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లకు వెళ్లి జ్వరాల కేసులు గురించి తెలుసుకుని విజృంభించకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో ప్రైవేట్ ఆస్పత్రులే గతి

గత ప్రభుత్వంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తే ప్రైవేట్ ఆస్పత్రులే గతి. జలుబు, దగ్గు, జ్వరం వస్తే స్థానికంగా వైద్యం అందే మార్గం లేక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లేవారు. పరీక్షల కోసం రూ.500 నుంచి రూ.1000 ఖర్చు చేసేవారు. డాక్టర్ ఫీజు, మందుల ఖర్చు మరో రూ.1300 నుంచి రూ.1500 ఖర్చు చేసేవారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకితే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు జ్వరాలకు, దగ్గు, జలుబు వంటి వాటికి విలేజ్ క్లినిక్‌ల్లో వైద్యం అందించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లే అవసరం లేకుండా గ్రామంలోనే వైద్య సేవలు పొందడం సంతోషంగా ఉందంటున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలు

వశిష్ట గోదావరి ఉధృతితో ఆచంట, యలమంచిలి, నర్సాపురం మండలాల్లోని పలు లంక గ్రామాలు వరద ముంపునకు గురికావడంతో ఆయా గ్రామాల్లోని స్థానిక విలేజ్ క్లినిక్‌లలో, ప్రత్యేక శిబిరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.

జ్వరాలపై సర్వే పూర్తి

జిల్లాలో ముందస్తుగానే జ్వరాలపై వైద్య ఆరోగ్య శాఖ సర్వే చేపట్టింది. ఈ సర్వే ఇటీవల పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా సాధారణ జ్వరాల కేసులు 200 వరకు ఉన్నట్లు గుర్తించారు.

జిల్లాలో ఆస్పత్రులు వివరాలు:		
జిల్లా ఆస్పత్రి	:	1
ఏరియా ఆస్పత్రులు	:	4
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	:	32

సద్వినియోగం చేసుకోవాలి



జ్వరాలు, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులకు స్థానికంగా ఉన్న విలేజ్ క్లినిక్‌ల్లో వైద్య సేవలు వినియోగించుకోవాలి. మెరుగైన వైద్యం అవసరమైతే పీహెచ్‌సీల్లో వైద్య సేవలను ఉపయోగించుకోవాలి. విలేజ్ క్లినిక్‌ల్లో ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో 25 ప్రత్యేక మెడికల క్యాంపులు ఏర్పాటు చేశాం.

డాక్టర్ మహేశ్వరరావు,
జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి, భీమవరం

వరి చేలల్లో వర్షపు నీటిని మళ్లించండి



కానుకొల్లులో పొలాలను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

మండవల్లి: భారీ వర్షాల వల్ల వరిచేలల్లో చేరిన వర్షపు నీటిని బయటకు మళ్లించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. కానుకొల్లులో వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం బుధవారం పర్యటించి వర్షాలకు మునిగిన వరి చేలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏలూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు టి.సుజాత, కె.ఫణికుమార్, కేవీకే ఉండి శాస్త్రవేత్త ఎ.రాజేష్, ఏలూరు డీఆర్‌సీ ఏడీఏ పి.లలిత సుధ, మండవల్లి ఏడీఏ జి.వెంకట మణి, ఏఓ ఎస్‌కే జరీనా రైతులతో మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు ముంపు నీరు చేల నుంచి బయటకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బూస్టర్ డోస్‌గా ఎకరానికి 20 కేజీల యూరియా, 15 నుంచి 20 కేజీల పొటాష్ వేయాలన్నారు. తెగుళ్లు రాకుండా కార్బండిజం 1 గ్రాము, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ముదురు నాట్లు వేసే రైతులు చదరపు మీటరుకు ఎక్కువ కుదుళ్లు ఉండేలా కుదురుకు 3, 4 మొక్కలు ఉండేలా దగ్గర దగ్గరగా నాట్లు వేసుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి
- జంగారెడ్డిగూడెం స్టేషన్, సర్కిల్ కార్యాలయాల తనిఖీ



జంగారెడ్డిగూడెంలో డీఎస్పీ, సీఐలతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

జంగారెడ్డిగూడెం: యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం ఆమె సందర్శించారు. స్టేషన్లలో రికార్డులను పరిశీలించి, కేసుల తీరుతెన్నులను డీఎస్పీ, సీఐలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా జంగారెడ్డిగూడెం రావడం జరిగిందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీజీపీల ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాన్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌ను విజిట్ చేసి కేసుల తీరు తెన్నులను తెలుసుకుంటూ సిబ్బందికి సూచనలు ఇస్తున్నామన్నారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో గత 15 రోజుల వ్యవధిలో 3 గంజాయి కేసులు నమోదయ్యాయని, ఈ కేసుల్లో 28 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు ఎక్కువగా యువత బానిస అవుతుండటం గమనించామని, దీనిని నివారించేందుకు కళాశాలల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కాలేజీల వద్ద హోర్డింగ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాల బారిన పడినా, అమ్ముతున్నా అటువంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని విద్యార్థులకు తెలిజేస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయికి సంబంధించిన సమాచారం 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రజలు సైతం సహకరించాలని, ముఖ్యంగా యువత తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. అనంతరం ఆమె ఎస్సై, పోలీస్ క్వార్టర్లను పరిశీలించారు. క్వార్టర్ల మరమ్మతులకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించి త్వరలో చర్యలు చేపడుతామన్నారు. ఇక జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో టౌన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని, రూరల్ పోలీస్‌స్టేషన్ అవసరం ఉందని పేర్కొన్నారు. డీఎస్పీ ఎం.ధనుంజయుడు, సీఐ పి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



కాళ్ల: ఏలూరుపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

వైభవంగా వెంకన్న కల్యాణం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో అధిక శ్రావణమాసం శ్రవణా నక్షత్ర మహోత్సవం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కన్యావరణం, లగ్నాష్టకములు, కన్యాదానం, మాంగల్య ధారణ, అక్షతారోపణ మొదలగు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఐదుగురు జంటలు ఉభయదారులుగా ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నట్లు కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలియజేశారు. శ్రవణా నక్షత్ర సందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని కల్యాణాన్ని వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న జె.సత్యసుధామ

భీమవరం (ప్రకాశం చౌక్): కార్మికులకు పనికి తగిన వేతనం అందేలా, కార్మిక సమస్యలు పరిష్కరించి, నిబంధనలు పాటించని ఫ్యాక్టరీల యాజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు సత్యసుధామ బుధవారం భీమవరం కార్మిక శాఖ అధికారులకు వినితి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా, వివిధ ఫ్యాక్టరీల తనిఖీలలో భాగంగా ఇటీవల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు మూడు ఫ్యాక్టరీలను తనిఖీ చేయగా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ముఖ్యంగా ఎస్సీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పనికి సమాన వేతనం, సోషల్ సెక్యూరిటీ, బీమా వంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గతంలో కాళ్ల మండలంలో ఆక్వా ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ చనిపోయిన కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలంటూ ఫ్యాక్టరీ గేట్ల ముందు ఆందోళనలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయన్నారు. పొల్యూషన్ బోర్డు అధికారులు ఫ్యాక్టరీల తనిఖీలలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వర్షాకాలంలో ఫ్యాక్టరీల నుంచి దుర్గంధం, విషవాయువులతో కూడిన మురుగు విడుదలవుతున్నాయన్నారు. దీని వల్ల ఈ ఫ్యాక్టరీల చుట్టుపక్కల నివశించే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా ఉండి మండలం వాండ్రం, కాళ్ల మండలం సీసలిలో ఫ్యాక్టరీల వద్ద ఈ పరిస్థితి తీవ్రంగా ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో కార్మిక శాఖ అధికారులతో కలసి నిబంధనలు అమలు చేయని ఫ్యాక్టరీలను తనిఖీలు చేసి వాటిలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి కటికతల రాజారావు, ఉమెన్స్ వెల్ఫేర్ పౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

‘బాబు అండ్ కో’ను ప్రజలు నమ్మరు



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో ప్రాంతీయ విబేధాలు సృష్టిస్తున్న బాబు అండ్‌కోను ప్రజలు నమ్మరని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన జవాబు చెంపపెట్టు అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం అన్ని రకాలుగా పేదవాడికి అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదవాడికి జానెడు జాగా ఇచ్చి, ఇళ్లు కట్టించిన దాఖలాలు లేవన్నారు. సీఎం వైఎస్ జగన్ లక్షలాది ఇళ్లను కట్టిస్తుంటే, అక్కసుతో తప్పుడు కేసులు కోర్టులో వేసి అడ్డుకోవడానికి ప్రయత్నం చేయడం, ఎంతవరకు సమంజసమన్నారు. బాబి, ప్రేమ్, సునీల్, అచ్చిబాబులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్


సాక్షి, భీమవరం: బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు జిల్లా దిశ స్టేషన్ డీఎస్పీ నున్న మురళీకృష్ణ బుధవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని లంకపేటకు చెందిన ఉండ్రు రాజు (రాకెట్‌రాజు) అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేయడంపై గత నెల 31న పోక్సో కేసు నమోదైంది. నిందితుడు రాజును అరెస్ట్ చేసి భీమవరం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు.

మహిళా ప్రయాణికుల పర్సుల చోరీ

రూ.34,800 నగదు, 2 బంగారపు ఉంగరాలు, 2 సెల్‌ఫోన్ల అపహరణ

నూజివీడు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ బయట ఉన్న నాన్‌స్టాప్ టికెట్ కౌంటర్ వద్ద బుధవారం ముగ్గురు మహిళా ప్రయాణికుల బ్యాగ్‌ల నుంచి పర్సులు చోరీకి గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన వనజాక్షి, మరో ఇద్దరు మహిళలు విజయవాడ వెళ్లేందుకు పుట్రేల నుంచి నూజివీడు బస్టాండ్‌కు చేరుకున్నారు. ఇక్కడి నాన్‌స్టాప్ టికెట్ కౌంటర్ వద్ద టికెట్లు తీసుకుని బస్సు ఎక్కారు. తరువాత వీరు తమ బ్యాగ్‌లు చూసుకోగా పర్సులు కనిపించకపోవడాన్ని గుర్తించారు. ముగ్గురు మహిళల లగేజీల నుంచి ఆగంతకులు రూ.34,800 నగదు, రెండు బంగారు ఉంగరాలు, రెండు సెల్‌ఫోన్‌లను దొంగిలించారు. దీంతో వారు డిపో మేనేజర్ సూర్య పవన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ముగ్గురి అరెస్టు.. 5 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ మూర్తి, చిత్రంలో ఎస్సై వీరభద్రరావు

తాడేపల్లిగూడెం రూరల్: నిషేధిత గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి చెప్పారు. బుధవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. రూరల్ పోలీస్ సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు నల్లజర్ల - తాడేపల్లిగూడెం మార్గంలో పెదతాడేపల్లి అండర్‌పాస్ వద్ద ముగ్గురు యువకులు పోలీసుల రాకను గుర్తించి పరారయ్యేందుకు ప్రయత్నించారు. దీంతో మల్లాడి వినయ్‌కుమార్ (మాధవాయిపాలెం), కాటం రాజశేఖర్ (రామన్నపాలెం), దేశినీడి దుర్గాప్రసాద్ (మాధవాయిపాలెం)లను తహసీల్దార్, మధ్యవర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.20 వేలు ఉంటుందని పేర్కొన్నారు. విచారణలో అరకు నుంచి ఈ గంజాయిని తీసుకువస్తున్నట్లు తేలిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను విజయవంతం చేయండి



కైకలూరు సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో తుతిక శ్రీనివాస విశ్వనాథ్

కైకలూరు: స్వామిత్వ పథకం కింద పంచాయతీల్లో గ్రామకంఠాలను గుర్తించే సర్వేను విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తుతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. కైకలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకంపై సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సెక్రటరీలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ కైకలూరు మండలంలో రామవరం, శింగాపురం, గోపవరం గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. సర్వే చేసిన ప్రాంతాల్లో గ్రామసభలను నిర్వహించి ఆర్వోఆర్ నివేదికలను సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులలో అలసత్వం వద్దని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో కె.పూర్ణచంద్రశేఖర్, ఎంపీడీవో జి.రాంబాబు, సర్వే డెప్యూటీ తహసీల్దారు ప్రసాద్, ఈవోపీఆర్‌డీ రవిశంకర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

కోడలు కనిపించడం లేదని అత్త ఫిర్యాదు

కాళ్ల: తన అక్కను కలవడానికి వెళ్లిన కోడలు కనిపించడం లేదంటూ అత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జక్కరం గ్రామానికి చెందిన నీలి భద్రావతి చిన్నకుమారుడు కామేశ్వరరావుకు సుమారు నాలుగేళ్ల క్రితం విజయవాడకు చెందిన ఉమామహేశ్వరితో వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. వృత్తి రీత్యా టాంజేనియా దేశంలో నివాసం ఉంటున్నారు. అయితే రెండు నెలల క్రితం పాపను తీసుకుని విజయవాడలోని పుట్టింటికి వచ్చింది. జూలై 31వ తేదీ సోమవారం పాపతో కలిసి జక్కరం గ్రామంలోని అత్తింటికి వచ్చింది. బుధవారం తెల్లవారుజామున తన అక్క ఇంటికి వెళ్లివస్తానని చెప్పి కుమార్తెను అత్తింటి వద్ద వదిలి విజయవాడ వెళ్లింది. ఆ తరువాత ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. అక్క, పుట్టింటికి కూడా చేరుకోలేదు. దీంతో అత్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

క్రైస్తవ ర్యాలీని విజయవంతం చేయాలి



గూడెం టౌన్ లూథరన్ ఎక్లాస్ ఫ్యారిష్ చర్చిలో సమావేశమైన క్రైస్తవ జేఏసీ కమిటీ సభ్యులు

పెంటపాడు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దమన కాండను నిరసిస్తూ గూడెం జేఏసీ యాక్షన్ కమిటీ స్థానిక లూథరన్ చర్చిలో సమావేశం నిర్వహించింది. ఆ సంఘటనను ఖండిస్తూ ఈనెల 3న ఉదయం అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని సంఘ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. ఉదయం 10 గంటలకు గూడెంలోని ఎస్వీ రంగారావు సర్కిల్ నుంచి ఈ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. క్రైస్తవ జేఏసీ సంఘాలు, ప్రజాస్వామ్య వాదులు, కళాకారులు తప్పక ఈ కార్యక్రమంలో ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు బల్లిపాడులో గడపగడపకు కార్యక్రమం

అత్తిలి: మండలంలో బల్లిపాడు గ్రామంలో గురువారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. ఈకార్యక్రమానికి పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు కారుమూరి సునీల్ కుమార్ హాజరౌతారని తెలిపారు. పార్టీనాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

జట్లపాలెంలో పొలంబడి



సమావేశంలో మాట్లాడుతున్న కట్టుబోయిన కృష్ణప్రసాద్

పెంటపాడు: దేశానికి అన్నంపెట్టే రైతన్నకు పలు పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండగ చేశారని మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పెంటపాడు మండలంలోని జట్లపాలెం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు పథకాలను వివరించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సకాలంలో వర్షాలు కురవడం వల్ల రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. ఏవో సారధి మాట్లాడుతూ చీడపీడల నివారణకు చేలలో తక్కువ నీరు ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షాలు వస్తున్న సమయంలో ఎరువులు పురుగుమందుల వాడకం చేయరాదన్నారు. ఇటీవల కురిసిన వర్షం రైతులుకు మేలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు వీఏఏలు పాల్గొన్నారు.

దువ్వలో పొలంబడి కార్యక్రమం

తణుకు టౌన్: రైతులు వ్యవసాయంలో మిత్ర పురుగులు, శత్రు పురుగలు పట్ల అవగాహనతో మెలగాలని తణుకు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎంబీ రమేష్ చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. రైతులకు మిత్ర పురుగుల వలన కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఏవో కే కుసుమ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

21లోగా ఓటర్ల సర్వే పూర్తి చేయాలి

సాక్షి, భీమవరం: ఓటర్ల జాబితా ఆధారంగా ఇంటింటికీ వెళ్లి చేపట్టిన సర్వేను ఈనెల 21లోగా పూర్తి చేయాలని ఆర్డీఓ దాసి రాజు ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం నియోజవర్గ బీఎల్వోలతో సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. జాబితాలో తప్పులను సరిచేయాలన్నారు. జనసేన మినహా మిగిలిన రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఓలు పాల్గొన్నారు.

అందాల హరివిల్లు- ఆనందాల విరిజల్లు

- కళ్లముందే కలల సౌధాలు
- జోరుగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు
- చురుగ్గా విద్యుత్, రోడ్లు మౌలిక సదుపాయాలు



ప్రత్తిపాడు జగనన్న కాలనీలో రోడ్డు నిర్మాణానికి చిప్స్ పోస్తున్న దృశ్యం



ప్రత్తిపాడు జగనన్న కాలనీలో సెంటున్నర స్థలంలో సుందరంగా తీర్చిదిద్దుకొన్న జగనన్న ఇళ్లు

పెంటపాడు: జగనన్న ఇళ్ల నిర్మాణాలతో అందాల హరివిల్లు- ఆనందాల విరిజల్లు రానే వచ్చింది. జగనన్న సర్కారు పేదలకు చక్కని గూడు నిర్మిస్తోంది. కళ్ల ముందు కలల సౌధాలను తీసుకొస్తోంది. ఎన్నో ఏళ్ల కలను తీర్చి ఆనందాన్ని నింపుతోంది. ఇప్పటి వరకు పూరిగుడిసెల్లో ఎండకు ఎండి వానకు తడిచి దేవుడే దిక్కు అనుకొంటూ ఎందరో నిరుపేదలు కాలం వెళ్ల దీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత పేదల బతుకులు మారాయి. సొంతింటి కల నెరవేర్చుతానని ఇచ్చిన హమీలు అమలు చేస్తుండటంతో వారి ఆనందానికి అవధులు లేవు. సొంతింటి కల నెరవేరుస్తానని ఇచ్చిన హామీలు అమలు చేస్తుండటంతో పేదలు మురిసిపోతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమ కల నెరవేరిందని సంబరపడుతున్నారు. పలు గ్రామాల్లో జగనన్న కాలనీ పురుడు పోసుకొని కొత్త కాలనీలు, ఊళ్లుగా ఏర్పాడ్డాయి. పెంటపాడు మండలంలో 22 గ్రామాల్లో 26 లే అవుట్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో 1400 ప్లాట్లు వేశారు. వాటిని 1370 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటికే 382 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 507 నిర్మాణ దశల్లో ఉన్నాయి. బీబీఎల్ 481 ఉన్నాయి. రెండో ఫేజ్‌లో మరో 5 లేఅవుట్‌లు ఏర్పాటు చేశారు. లబ్ధిదారుల ప్రక్రియ కూడా వేగంగా జరుగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ సౌధాలు నిర్మించుకొనేలా భాటలు వేసారని, తమ గుండెల్లో ఆయన చిరస్థాయిగా ఉంటాడని లబ్ధిదారులు చెబుతున్నారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గృహనిర్మాణశాఖ ద్వారా రూ. 1.80 లక్షల రాయితీతో ఇంటి నిర్మాణానికి రుణం అందిస్తున్నారు. మహిళా సంఘాలకు రూ. 50 వేలు అదనంగా బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తున్నాయి. ఇంటి రుణంలో రాయితీపై సిమెంట్, ఇసుకతో పాటు, ఇనుము ప్రభుత్వం అందజేస్తోంది. 4వ దశలో బిల్లులను లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లో గృహనిర్మాణశాఖ జమచేస్తోంది. లే అవుట్లలో మెరకపనులు పూర్తవడంతోపాటు, విద్యుత్, తాగునీటి సౌకర్యం రహదారుల వంటి పనులు ప్రభుత్వం వేగవంతంగా పూర్తి చేస్తోంది. ప్రభుత్వ సహకారంతో లబ్ధిదారులు తమ ఇళ్లను వేగంగా పూర్తి చేసుకొంటున్నారు.

జగనన్న మేలు మర్చిపోలేం



కూలీ పనిచేసుకొని జీవించే తాము ఇళ్లు సమకూర్చుకొంటామని అనుకోలేదు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నా వారి భవిష్యత్ గురించే బెంగ ఉండేది. అందుకే ఇంటిపై ఆశ వదులుకున్నాం. కానీ జగనన్న పుణ్యమా అని జగనన్న కాలనీలో సొంతిల్లు కట్టుకున్నాం. ఇల్లు పూరైన తరువాత ఇది కలా,నిజమా అనే అనుమానం వస్తోంది.

– రామకృష్ణ, ప్రత్తిపాడు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



పేకేరులో మెడికల్ క్యాంపులో మందులు అందజేస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

ఇరగవరం: ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు కారుమూరి సునీల్‌కుమార్ చెప్పారు. ఇరగవరం మండలం పేకేరు గ్రామంలో కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సునీల్‌కుమార్ మాట్లాడుతూ కారుమూరి సేవా సమితి ద్వారా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ వెలగలసాయిబాబారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కోడే జోషి, చింతాబాపిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నవాబుపాలెంలో ఐద్వా నిరసన



తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో నిరసన కార్యక్రమం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రగతిశీల మహిళా సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మ ండలంలోని నవాబుపాలెం గ్రామంలో మణిపూర్ సంఘటనలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ మణిపూర్ సంఘటనలపై పాలక పక్షాల నాయకులు, పవన్ కళ్యాణ్ మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కమిటి సభ్యురాలు కండెల్లి కమల కుమారి, కొల్లి అక్కమ్మ, కండెల్లి విజయ, గెడ్డం లక్ష్మీ, కండెల్లికుమారి, ఉండ్రాజవరపు కుమారి, పేకేటి నాగమణి, కండెల్లి రాణి, ఉప్పాటి పార్వతి,రుద్ర సత్యవతి పాల్గొన్నారు.

సమాజంలో శాంతిభద్రతలు కాపాడాలి



కుంచనపల్లి గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మణిపూర్ ఘటనలు సభ్య సమాజం తల దించుకునేలా ఉన్నాయని, సమాజంలో శాంతిభద్రతలను కాపాడాలని ఇఫ్టూ జిల్లా సహాయక కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ కారంచేడు నుంచి చుండూరు వరకు దళితులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేయడం దారుణమన్నారు. ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇప్పటికైనా సమాజంలో అసమానతలు లేకుండా శాంతిభద్రతలు కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.కోటేశ్వరరావు, శామ్యూల్, నాగేంద్ర, శ్రీరాములు, ముసలయ్య, పౌలు, గెరటయ్య, జాన్సన్, జాన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన



అయితంపూడి గ్రామంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



దువ్వలో పిల్లలకు టీకాలు వేస్తున్న ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది

తణుకు టౌన్ : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తణుకు మండలం వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం తల్లులకు అవగాహన కార్యక్రమం వైద్యాధికారి హరణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతమన్నారు. పిల్లలకు తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. అనంతరం గ్రామంలో వ్యాధి నిరోదక టీకాలు కార్యక్రమం, మంచినీటి ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దువ్వ గ్రామంలో ఆరోగ్య సహాయకులు ఎంపీ వెంకట్రావు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సహాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండపాక గ్రామంలో ఆరోగ్యసూపర్ వైజర్, సహాయకులతో పాటు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలివ్వాలి

ఇరగవరం: బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి తెలిపారు. ఇరగవరం మండలంలోని అయితంపూడి గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను తెలియజేసేలా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ఎంతో ఆరోగ్యదాయకమన్నారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పటంలో 'గూడెం' ముఖచిత్రం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- జగన్నాథపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో సచివాలయం-2, రైతు భరోసా కేంద్రం-2లను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: దేశంలో రెండవ అతి పెద్ద విశ్వవిద్యాలయంగా ఉన్న ఉద్యానవర్సిటీని తీసుకొచ్చి ప్రపంచ పటంలో తాడేపల్లిగూడెంకు ఒక ప్రత్యేక స్థానాన్ని తీసుకొచ్చానని ఉప ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన సచివాలయం-2, ఆర్‌బీకే-2, హెల్త్‌క్లీనిక్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మెడికల్‌లో సీటు సాధించలేని వారు సెకండ్ ఆప్షన్‌గా వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని ఎంచుకుంటున్నారన్నారు. ఈ విశ్వవిద్యాలయం నుంచి మూడు వేల మంది విద్యార్థులు పాస్ అవుట్ అయి నేడు నూరు శాతం ప్లేస్‌మెంట్‌తో పనిచేస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెం చరిత్రలో ఎంతో మంది శాసనసభ్యులుగా పనిచేశారని, ఏనాడైనా వారి ముద్ర ఉందా ? అని ప్రశ్నించారు. తాడేపల్లిగూడెం రాజకీయ చరిత్రలో 2004–2009 ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధి జరుగుతున్న తరుణంలో 2009వ సంవత్సరంలో పొంగే పాలకుండను పగలకొట్టిన చందంగా ప్రజలు వేరొకరిని గెలిపించారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబును గెలిపిస్తే ప్రజలు మోసపోయారన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. నవాబుపాలెం – జగన్నాథపురం మూడు కిలో మీటర్ల రహదారిని 2006వ సంవత్సరంలో వేయడం జరిగిందని, నాటి నుంచి గత పాలకులు ఈ రోడ్డు వేసిన పాపాన పోలేదన్నారు. తాను మరలా గెలుపొందిన తర్వాత నవాబుపాలెం వయా అప్పారావుపేట, కొమ్ముగూడెం, వీరంపాలెం, త్యాజంపూడి వరకు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.8 కోట్లు, నవాబుపాలెం నుంచి జగన్నాథపురం, మాధవరం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం వరకు రూ.8.65 కోట్లతోనూ, నవాబుపాలెం నుంచి ఆరుగొలను, దండగర్ర వరకు రూ.7కోట్లుతోనూ ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో రోడ్డు నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. చిలకంపాడు నుంచి వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు రూ.45 కోట్లతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేశామన్నారు. టీడీపీ పాలనలో ఏనాడైనా నాలుగు లైన్ల రహదారి గురించి టీడీపీ నాయకులకు తెలుసా ? అని నిలదీశారు. దగుల్బాజీ పార్టీ అని ఘాటుగా విమర్శించారు. తాడేపల్లిగూడెం దశ, దిశా మార్చానని చెప్పారు. జగన్నాథపురం ఎర్ర కాలువ ముంపు రైతాంగానికి ఒక్క సెంటు కూడా వదలకుండా పూర్తి స్థాయిలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించడం జరిగిందన్నారు. రూ.2లక్షలు బీమా ఉన్న సాంకేతిక కారణాలతో ఆగడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరిగిందన్నారు. ఇటీవల కొంతమందికి సొమ్ములు పడ్డాయన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే సొమ్ములు పడతాయని, ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిషన్ భరోసా నిచ్చారని మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, వైస్ ఎంపీపీలు సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏపీఎం జీవీ కేడీఎం.లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, సొసైటీ చైర్మన్లు, ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

400 మందికి ఉచిత వైద్యపరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెంటపాడు: గూడెం భాగ్యలక్ష్మి పేట ఎల్ఎల్ఎం చర్చిలో బుధవారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెం వైష్టవి ఆసుపత్రి డాక్టర్ వి. వెంకట్రావు గుండె, ఊపిరితిత్తులు, సుగర్, బీపీ కాలేయ తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేశారు. రాజమండ్రికి చెందిన శ్రీరామ్ ఐ కేర్ ఆసుపత్రి డాక్టర్లు వి. అశోక్ కుమార్, పి. సౌమ్య తదితరులు కంటి రెటీనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు చేయించుకొన్న రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అన్ని వ్యాధులకు సంబంధించి సుమారు 400 పరిసర గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, ఎల్ఎల్ఎం హెల్పింగ్ టీం సభ్యులు శాంతిరాజు, పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యమిస్తున్న సీఎం జగన్



జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద భోజనాన్ని రుచి చూస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా రెండు విడతల్లో పాఠశాలకు రూ. 3 కోట్లకు పైగా నిధులు సమకూర్చి పాఠశాలతోపాటు తరగతి గదులను అత్యాధునికంగా తీర్చిదిద్దారని అన్నారు. విద్యుత్ పరికరాలు, మరుగుదొడ్లు నూతనంగా ఏర్పాటుచేశారని, 13 తరగతి గదులను అధనంగా నిర్మాణం చేపట్టారని స్పష్టం చేశారు. పాఠశాలలో ట్యాబ్‌లను విద్యార్థులు బాగా సద్వినియోగపరచుకుంటున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని వసతులను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. ఈ సందర్భంగా జననన్న గోరుముద్ద భోజన పథకాన్ని స్వయంగా చూసి విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ శెట్టిబలిజ అధ్యక్షురాలు వనం కల్యాణి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చేశెట్టి లలితా శంకర్, కారుమంచి యోహాన్, కుడుపూడి చంద్రరావు పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి, ఉపాధ్యాయులు జిజే ప్రభువరం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు గొడుగులు పంపిణీ...

ఆల్ ఇండియా పూలే అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తణుకు ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు బుధవారం వైఎస్సార్‌సీపీ యువనేత కారుమూరి సునీల్‌కుమార్ చేతులమీదుగా గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, న్యాయవాది పొట్ల సురేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, దుర్గాప్రసాద్, హాస్టల్ వార్డెన్ అరుణ అజయకుమారి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీసీలపై టీడీపీ నాయకుల వివక్షను విడనాడాలి



వేల్పూరులో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: వేల్పూరు గ్రామంలోని బీసీ కులాల పట్ల తెలుగుదేశం నాయకులు ఇప్పటికైనా తమ వివక్షా పూరిత దోరణిని విడనాడి బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని రాష్ట్ర శెట్టిబలిజ సంఘం ఉపాధ్యక్షు డు, వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి సత్య రాజేంద్ర ప్రసాద్ కోరారు. వేల్పూరులో తణుకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు, రాష్ట్ర శెట్టిబలిజ సంఘం ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి సత్య రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు నియోజకవర్గంలోని వివిధ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో బీసీల పట్ల టీడీపీ నిరంకుశ వైఖరిని నిరశిస్తూ దీక్షలు చేస్తుంటే టీడీపీవారు విమర్శించడం దారుణమన్నారు. వేల్పూరు లో నిర్మిస్తున్న బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మా ణం పూర్తి అయితే టీడీపీ నాయకులు తమ ఉనికి దెబ్బతింటుందనే ఆందోళనతోనే అడ్డుకుంటున్నారని విమర్శించారు. మంత్రి కారు మూరి వెంకట నాగేశ్వరరావు బీసీల అభివృద్ధికి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు పంచాయితీ నుంచి సహకరించాలన్నారు. ఈశిబిరాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు పాల్గొని సంఘీబావం తెలిపారు. ఇరగవరం జెడ్పీటీసీ సభ్యుడు పంపన అంజిబాబు, తణుకు మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఇరగవరం మండల పార్టీ అధ్యక్షుడు కె దుర్గా ప్రసాద్, వేల్పూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, మహిళా అధ్యక్షురాలు చంద్రు శ్యామల, ఎంపీటీసీలు రెడ్డి హైమా, విజయ దుర్గ, పంచాయితీ సభ్యుడు రెడ్డి సత్తిరావు, మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, నియోకజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ పొట్ల సురేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, ఎస్సీ సెల్ నాయకులు తాడిపర్తి రాజశేఖర్, కత్తుల జస్పాల్, తలపాకుల రాము, దారం శ్రీను, కాకరపర్తి ఆంజనేయులు, వివిధ గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.